క్లుప్తంగా

కోట శ్రీనివాసరావు చిరస్మరణీయుడు



కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

సూర్యాపేట : నాలుగు దశాబ్దాల పాటు తన వైవిధ్యమైన నటనతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలిచిన కోటా శ్రీనివాసరావు చిరస్మరణీయుడని భానుపురి సాంస్కృతిక కళావేదిక అధ్యక్షుడు గుండా రమేష్ తెలిపారు. నటనతో తెలుగు భాషను సమున్నత స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి కోటా శ్రీనివాసరావు అని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంజన ప్రసాద్, నూనె యుగంధర్, మధు తదితరులు పాల్గొన్నారు.

చెస్‌పోటీలు మేధాశక్తిని పెంచుతాయి



విద్యార్థులతో చెస్ ఆడుతున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృపాకర్

సూర్యాపేట : చెస్‌పోటీలు విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందిస్తాయని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి అండర్ 13 చెస్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో అండర్ 13 బాలుర విభాగంలో మొదటి బహుమతి రక్షిత్ చారి, రెండవ బహుమతి అఖిలేష్, మూడవ బహుమతి విక్రాంత్ రెడ్డి, నాలుగవ బహుమతి గౌతమ్ కృష్ణ, బాలికల విభాగంలో మొదటి బహుమతి అనంత లక్ష్మి, రెండవ బహుమతి యోచన సిద్ధార్థ కోమల్, మూడవ బహుమతి కుషాలి రెడ్డి గెలుపొందినట్లు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ కార్యదర్శి సతీష్ కుమార్, సంయుక్త కార్యదర్శి రంగారెడ్డి, జానయ్య, నరసింహారావు, భిక్షపతి, కళ్యాణ్, భిక్షం, మురళి, సందీప్ పాల్గొన్నారు.

రామచంద్రరావు పర్యటనను విజయవంతం చేయాలి

సూర్యాపేట : ఈ నెల 14న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సూర్యాపేట నియోజకవర్గంలో పర్యటిస్తున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించే కార్యకర్తల సమ్మేళనానికి హాజరవుతున్నారని పేర్కొన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో ప్రతి పోలింగ్ బూత్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

'ఏం సాధించారని సీఎం జిల్లాకు వస్తున్నారు'

సూర్యాపేటటౌన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఇప్పుడు ఏం సాధించారని సీఎం జిల్లాకు వస్తున్నారో చెప్పాలని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మాయమాటలతో సీఎం అయ్యి రెండేళ్లు కావస్తున్నా అభివృద్ధి మాత్రం శూన్యమని తెలిపారు. రేపటి సభే కాదు.. ఇక రాష్ట్రంలో ఎక్కడ సభలు పెట్టినా.. ప్రజల నుంచి నిరసన సెగలు తప్పవని హెచ్చరించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన గర్నె బాలయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ 1996–97 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన అతడి స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు ఐతబోయిన రాంబాబుగౌడ్, కోన వెంకన్న, నకిరేకంటి వెంకన్న, బోగరాజు వెంకన్న, బాదె శ్రీనివాస్, మీసాల సైదులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మృతుడి స్నేహితులు

గోదావరి జలాలు వచ్చేనా..?

- నీటి విడుదల షెడ్యూల్ కోసం అన్నదాతల ఎదురు చూపులు
- తుంగతుర్తి నియోజకవర్గంలో 1.10లక్షల ఎకరాల ఆయకట్టు



అర్వపల్లి శివారులో నారు మడి

అర్వపల్లి : వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో తుంగతుర్తి నియోజకవర్గ రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గోదావరి జలాలపై ఆధారపడి సాగు చేసే ఈ ప్రాంత అన్నదాతలు ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు తగ్గిపోవడంతో భవిష్యత్తుపై తర్జనభర్జన పడుతున్నారు.

ఆందోళనలో అన్నదాతలు..

సాధారణంగా ఈ సమయానికి రైతులు నార్లు పోసి, పొలాలు దున్ని నాట్లు వేయడం ముమ్మరం కావాలి. కానీ, వర్షాభావ పరిస్థితుల కారణంగా పొలాలు బీడు పడుతున్నాయి. ప్రధానంగా శ్రీరాం సాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ), దిగువ మానేరు డ్యామ్ (ఎల్‌ఎండీ)లలో నీటి మట్టాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం రైతులను కలవరపెడుతోంది. ఎస్సారెస్పీ రెండోదశ కింద నియోజకవర్గంలోని 1.10 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. ప్రస్తుతం ఎస్సారెస్పీ నుంచి రెండో దశకు నీటిని విడుదల చేసే పరిస్థితి లేకపోవడంతో ఆరు మండలాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

అడుగంటిన చెరువులు, కుంటలు..

చెరువులు, కుంటలు అడుగంటగా, బోర్లు, బావుల్లో నీటి మట్టాలు పడిపోయాయి. కొత్తగా బోర్లు వేసినా నీరు పడటం లేదని రైతులు వాపోతున్నారు. కొద్దిపాటి నీటి వసతి ఉన్న రైతులు నార్లు పోసి పొలాలు దున్నుకుంటుండగా, చాలా మంది రైతులు గోదావరి జలాల విడుదల షెడ్యూల్ కోసం ఎదురు చూస్తున్నారు. సాగునీటి వసతి లేని రైతులు తమ భూములను పడావు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సీఎం ప్రకటనపై రైతుల ఆశలు..

సోమవారం తిరుమలగిరిలో రేషన్‌కార్డుల పంపిణీ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా గోదావరి జలాల విడుదలపై సీఎం ఏదైనా ప్రకటన చేస్తారేమోనని తుంగతుర్తి నియోజకవర్గ రైతులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. సీఎం ప్రకటన తమ సాగు సంకటాన్ని తీరుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సాగునీటి విడుదలపై త్వరగా స్పందించి, తమకు భరోసా కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.

గోదావరి జలాలపైనే ఆధారం



గోదావరి జలాలపై ఆధారపడి పంట సాగు చేస్తున్నాను. వ్యవసాయానికి ఎలాంటి నీటి వసతి లేదు. ఐదు ఎకరాల భూమి గోదావరి జలాల తోటే సాగు చేస్తున్నాను. ప్రస్తుతం ఆ నీటి కోసమే ఎదురు చూస్తున్నాను. షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలి.

– చెరుకుపల్లి ప్రవీణ్, రైతు, తిమ్మాపురం

ప్రాజెక్టులు నిండితేనే నీళ్లు



ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీ ప్రాజెక్టులు నిండితేనే నీటిని వదిలే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టుల్లో కొద్దిపాటి నీళ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో షెడ్యూల్‌ను విడుదల చేసే పరిస్థితి లేదు. వర్షాలు పడి ఈ ప్రాజెక్టులు నిండితేనే రెండోదశకు నీటిని వదులుతాం.

– ఎం. సత్యనారాయణ, నీటి పారుదల శాఖ ఈఈ

పింఛన్ రూ.6వేలకు పెంచాలి



మాట్లాడుతున్న గడ్డం కాశీం

తుంగతుర్తి: వికలాంగుల ఆసరా పింఛన్లు రూ.6వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ గడ్డం కాశీం, భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వికలాంగుల రూ.4016 నుంచి రూ.6016కు, అదేవిధంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులకు రూ.2016 నుంచి రూ.4016 లకు పింఛన్లు పెంచాలని అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సుకు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చింత సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు జలగం శ్రీరాములు, మండల వీహెచ్‌పీఎస్ ఇన్‌చార్జ్ చెదుపాక బోసు, గుండాల కొమరయ్య, పోలెపాక మధు, బొంకూరి వెంకన్న, తడకమళ్ల సైదులు పాల్గొన్నారు.

నూతనకల్ : జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహిస్తున్న చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన పెన్షన్‌దారుల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి వీరయ్య, బాణాల వీరారెడ్డి, పరెడ్డి నవీన్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై సీఎం స్పందించాలి



మాట్లాడుతున్న ఆవుల నాగరాజు



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేటటౌన్ : సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ఉమ్మడి జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై స్పందించాలని ప్రొగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్(పీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించలేదని, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయలేదన్నారు. సమావేశంలో పీఎస్‌యూ ఉమ్మడి జిల్లా నాయకులు వంశీ, అజయ్, శ్యామ్ పాల్గొన్నారు.

యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలి

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ, డిగ్రీ యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సీఎం రేవంత్ రెడ్డిని అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, ప్రవీణ్, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

అర్వపల్లి : హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న సూర్యాపేటలో యూనివర్సిటీని మంజూరు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గ పర్యటన సందర్భంగా తుంగతుర్తి నియోజకవర్గంలో ప్రతి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్యాపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అర్వపల్లికి పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంటర్నేషనల్ స్కూల్‌ను మంజూరు చేయాలని కోరారు.

సీఎం సభను జయప్రదం చేయాలి



సూర్యాపేట : మాట్లాడుతున్న రామ్మూర్తి యాదవ్

సూర్యాపేట : తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో సోమవారం జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఉంద్రుగొండ గిరి దుర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి నాయకత్వంలో 100 వాహనాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమలగిరికి వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జ్యోతి కరుణాకర్, నిమ్మల వెంకన్న, తండు శ్రీనివాస్ గౌడ్, వల్దాస్ దేవేందర్, యాట వెంకన్న, ధర్మనాయక్, కొండల్, అరుణ్, శాంత కుమార్ పాల్గొన్నారు.

అర్వపల్లి : మహిళా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోయలపల్లి రేఖ అన్నారు. తిరుమలగిరిలో సోమవారం జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభ దృష్ట్యా జనసమీకరణలో భాగంగా అడివెంల గ్రామంలో ఆదివారం జరిగిన మహిళా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీఎం సభకు మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. మహిళల కోసం ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, ఉప్పలయ్య, నాయకులు పాల్గొన్నారు.

మద్దిరాల : తిరుమలగిరిలో సోమవారం జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏలేటి శ్యాంరెడ్డి, చెన్నునాయక్, నరేష్, రామ్మూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యాపేటకు మంద కృష్ణ మాదిగ రాక

సూర్యాపేట : హైదరాబాద్‌లో నిర్వహించనున్న వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల మహాగర్జన సదస్సును విజయవంతం చేసేందుకు సోమవారం సూర్యాపేటలో జరిగే జిల్లా సదస్సుకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఇతర సామాజిక పెన్షన్‌దారులు హాజరుకావాలని కోరారు.

మాజీ ఎంపీపీ గోరుగంటి మోహన్‌రావు మృతి

నూతనకల్ : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కుమారుడు, మాజీ ఎంపీపీ గోరుగంటి మోహన్‌రావు (72) అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం మృతి చెందారు. మృతుడు మండల పరిషత్ అధ్యక్షుడిగా, బిక్కుమళ్ల సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి ప్రజలకు సేవలందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన భౌతిక కాయాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, మాజీ ఎంపీపీ తాడూరి లింగయ్య, పసుల అశోక్ యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సూర్యాపేట : 30ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. సోలిపేటలో ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు బోడా శ్రీరాములు మాదిగ అధ్యక్షత వహించగా ఎమ్మార్పీఎస్ జాతీయ సమన్వయ కర్త చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఈదుల యాదగిరి, గోగిరెడ్డి వెంకట రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ తడకమల సుధాకర్ రావు, కందుల అశోక్ రెడ్డి, పల్స వెంకన్న, లింగయ్య గౌడ్, పల్స రమేష్ గౌడ్, మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు మరపల్లి సావిత్ర మాదిగ, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తుంగతుర్తిలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సూర్యాపేట : పట్టణంలోని ప్రగతి విద్యా నిలయం 2001– 2002 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 23 వసంతాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు పలకరించుకొని భావోద్వేగానికి గురయ్యారు. పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు, నాటి ప్రధానోపాధ్యాయుడు గుండా రమేష్, కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, గణిత బోధకులు వి.నాగయ్య, అరుణజ్యోతిలను సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1994–2001 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, రాజేశ్వరి, విద్యార్థులు చెరుకుపల్లి కిరణ్‌కుమార్, అర్వపల్లి ఉషాకర్, సైదులు, షాజహాన్, నాగులు మీరా, హరిక్రిష్ణ, సుదర్శన్, వీరస్వామి, లింగయ్య, రేణుక, జ్యోతి, సునీత, స్వప్న, అరుణ, షమీం, మౌనిక పాల్గొన్నారు.

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని విద్యాభారతి పాఠశాలకు చెందిన 2000-01 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు నసీరుద్దీన్, తాళ్లపెల్లి సోమన్న, పందిరి మల్లయ్య, కోట వెంకట గోపాల్, గుండగాని రాములు గౌడ్, గుడిపాటి సైదులు, సుదగాని మల్లేష్, బుర్ర శ్రీనివాస్, గునగంటి శ్రీనివాస్, వీర బ్రహ్మచారి, తుమ్మ బాబు, కోదాటి సత్యవతి, కత్తురోజు నాగమణి, పూర్వ విద్యార్థులు గాజుల రాజు, పూల్ సింగ్, గుండగాని సుధాకర్, వగలగాని మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట : గురువులతో పూర్వవిద్యార్థులు



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో..

అనాథ పిల్లలకు చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న ఉమేష్

ఆత్మకూర్(ఎస్): గట్టికల్ గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలకు తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఏనుగుతల ఉమేష్ ఆదివారం రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. అదేవిధంగా తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన రక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు పిల్లల నిత్యావసరాలకు అందజేశారు.

పెరికలు కలిసి మెలిసి ఉండాలి

చివ్వెంల : పెరికలు ఐకమత్యంగా కలిసి మెలిసి ఉండాలని సూర్యాపేట పట్టణ పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దాలి లింగయ్య, నూతన అధ్యక్షుడు పత్తిపాక వేణుధర్ అన్నారు. ఆదివారం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ప్రతిష్ఠ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన సూర్యాపేట పట్టణ కమిటీ ఎన్నికల్లో పాల్గొని మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడిగా పత్తిపాక వేణుధర్, గౌరవ అధ్యక్షుడిగా బందు వీరయ్య, సహాయ అధ్యక్షుడిగా యర్రంశెట్టి రామలింగయ్య, ప్రధాన కార్యదర్శిగా పోతరాజు నర్సయ్య, కోశాధికారిగా సోమిశెట్టి లింగయ్య, సంయుక్త కార్యదర్శిగా నట్టె కిరణ్, ప్రచార కార్యదర్శిగా దేవరగట్ల సతీష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు బాల్తు శ్రీనివాస్, సుంకరి ఆనంద్, దొంగరి వెంకటేశ్వర్లు, విజయ్ భాస్కర్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన

నూతనకల్ : మండల సమగ్ర అభివృద్ధిని చేపట్టాలని కోరుతూ మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పెద్దింటి రంగారెడ్డి, దాసరి శ్రీనివాస్, పిడమర్తి భరత్, మున్నా అశోక్, జటంగి వీరమల్లు, గడ్డం శ్రీను, ఇరుగు ప్రవీణ్, సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి వినూత్న ప్రచారం

అర్వపల్లి : ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ ఆదివారం తిమ్మాపురంలోని వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి కూలీలు, రైతులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సభలు, సమావేశాలు, ఉత్సవాలు, ప్రజల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రదేశాలకు వెళ్లి మద్యపానం, ధూమపానం, డ్రగ్స్ నిర్మూలనపై వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విచిత్ర వేషధారణ ద్వారా చేపట్టిన ప్రదర్శన కూలీలు, రైతులను ఆకట్టుకుంది.

మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌ను విమర్శిస్తే సహించం

నాగారం : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను విమర్శిస్తే సహించేది లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న వ్యవసాయ కమిషన్ సభ్యుడుగా ఉండి రాజకీయాలు మాట్లాడటం సరికాదని, అవసరమైతే ఆయనపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు చిల్లర చంద్రమౌళి, దోమల బాలమల్లు, కన్నెబోయిన మల్లేష్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

తిరుమలగిరి : మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌పై కాంగ్రెస్ నాయకుల అసత్య ఆరోపణలను ఖండిస్తున్నట్లు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో మంజూరైన అభివృద్ధి పనులకే ప్రస్తుతం శంకుస్థాపనలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు దూపటి రవి, పట్టణ శాఖ అధ్యక్షుడు సురేందర్, మాజీ సర్పంచ్‌లు ఆకుల వీరయ్య, దేవా, రవి పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు

నూతనకల్ : ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడంతో జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు పాల్పడితే భయపడే ప్రసక్తే లేదని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకులను తిరుగనివ్వమని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న మాట్లాడటం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిలుగౌడ్, గాడ్డుల లింగరాజు, బత్తుల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం

అర్వపల్లి : రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడిగా ఉన్న డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ రాజకీయాలు చేయడం తగదని, ఆయనపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ చెప్పారు. అర్వపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకన్న వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకుడు బొడ్డు రామలింగయ్య, మండల నాయకులు డాక్టర్ రామకోటి పాల్గొన్నారు.

తుంగతుర్తి : మాజీ ఎమ్మెల్యేపై చెవిటి వెంకన్న చేసిన తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, గోపగాని రమేష్, మట్టిపెల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చర్చకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమా?

మద్దిరాల : పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై చర్చకు మేము సిద్ధంగా ఉన్నామని, చర్చకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధమా అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ.రజాక్ సవాల్ విసిరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మాజీ వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోడి శ్రీనివాస్ పాల్గొన్నారు.